RNI No: APTEL /25/A2860

సీమ వార్త
# సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 56 | పేజీలు : 4 | శుక్రవారం 28 ఆగస్టు 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



## నేపాల్ వరద బీభత్సం

ప్రవాహాన్ని తట్టుకుని నిలిచిన ఒక్కే ఒక్క ఇల్లు!

నేపాల్‌ను ముంచెత్తిన భారీ వరదలు

ప్రవాహానికి చెక్కుచెదరకుండా నిలిచిన ఓ భవనం

చుట్టుపక్కల ఇళ్లు, ట్రక్కులు కొట్టుకుపోయినా స్థిరంగా ఉన్న కట్టడం

# స్థానిక ఎన్నికలు జరగడం గొడ్డలిపార్టీ నాయకుడికి ఇష్టం లేదు

- స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు వైకాపా అధినేత జగన్ ప్రయత్నం
- ఎన్నికలు వాయిదా పడితే.. ఆ పార్టీకి లాభం అనుకోవడం దింపుడుకళ్లెం ఆశలే
- స్థానిక ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో జరిగితేనే రాజకీయ స్థిరత్వం ఉంటుంది
- ఏ ఎన్నికల్లోనైనా బీసీలకు ఎక్కువ సీట్లు ఇచ్చేది తెదేపానే





**అమరావతి**

స్థానిక ఎన్నికలు జరగడం గొడ్డలిపార్టీ నాయకుడికి ఇష్టం లేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ మేరకు మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో సీఎం చంద్రబాబు చిట్‌చాట్‌గా మాట్లాడారు. స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు వైకాపా అధినేత జగన్ యత్నిస్తున్నట్లు విమర్శించారు. ఎన్నికలు వాయిదా పడితే.. ఆ పార్టీకి లాభం అనుకోవడం దింపుడుకళ్లెం ఆశలే అన్నారు. స్థానిక ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో జరిగితేనే రాజకీయ స్థిరత్వం ఉంటుందన్నారు. ఏ ఎన్నికల్లోనైనా బీసీలకు ఎక్కువ సీట్లు ఇచ్చేది తెదేపానేని పేర్కొన్నారు. బీసీలకు 34 శాతం సీట్లు అనేది చట్టపరమైన రక్షణ మాత్రమే అని సీఎం పేర్కొన్నారు. గత ఎన్నికల్లో 34 శాతం కంటే ఎక్కువ సీట్లే బీసీలకు ఇచ్చినట్లు తెలిపారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



- అర్హులైన పేదలకు నిష్పక్షపాతంగా ఇందిరమ్మ ఇళ్లు
- జీహెచ్‌ఎంసీ పరిధిలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- మొదటి విడతలో 7,350 ఇళ్ల కేటాయింపు ప్రక్రియ
- 10 రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితా వెల్లడి
- విలువైన భూముల్లోనూ పేదల కోసం ఇళ్ల నిర్మాణం

**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో తొలి విడతలో భాగంగా 7,350 ఇళ్లను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ఇళ్ల పంపిణీ చేపడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజక వర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని వివరించారు. పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా వందల

- మిగతా 3లో

## జగద్గిరిగుట్టలో ట్రాఫిక్ పోలీసుగా మారి

- ట్రాఫిక్‌ను క్లియర్ చేసిన కండక్టర్
- రాఖీ పౌర్ణమి రద్దీలో ట్రాఫిక్ పోలీసుగా మారిన కండక్టర్
- మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్ట జంక్షన్‌లో ఘటన
- భారీగా నిలిచిపోయిన వాహనాలతో ఇబ్బందులు
- బస్సు దిగి స్వయంగా ట్రాఫిక్‌ను నియంత్రించిన ఉద్యోగి

### ప్రజల నుంచి వాట్సాప్ ద్వారా

# దరఖాస్తులు వచ్చినా పరిష్కరించాలి

- అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగే పరిస్థితి ఉండకూడదన్న జూపల్లి
- ప్రజల దరఖాస్తులకు వారం రోజుల్లోగా పరిష్కారం చూపాలని ఆదేశం
- అధికారులు పాత పనితీరును మార్చుకోవాలని హెచ్చరిక



**హైదరాబాద్**

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగే పరిస్థితి ఉండకూడదని... వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా దరఖాస్తు పంపినా అధికారులు తక్షణమే స్పందించాలని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. పానగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రజా సమస్యల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండున్నర ఏళ్లుగా ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారంపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలు తమ రోజువారీ పనుల్లో బిజీగా ఉంటారని, అందుకే పేరు, చిరునామా, ఫోన్ నంబర్‌తో కూడిన రాతపూర్వక ఫిర్యాదును వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా సంబంధిత అధికారులకు పంపవచ్చని వెల్లడించారు. అధికారులు ఆ దరఖాస్తులను ప్రింట్ తీసుకుని వెంటనే పరిశీలించాలని ఆదేశించారు. ప్రజలు ఇచ్చే దరఖాస్తులకు గరిష్ఠంగా వారం రోజుల్లో పరిష్కారం చూపాలని, ముఖ్యంగా విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను రెండు మూడ్రోజుల్లోనే జారీ చేయాలని

- మిగతా 3లో

# తెలంగాణ కుటుంబాలకు ఊరట.. తగ్గనున్న పన్ను భారం!

- జీఎస్టీ 2.0తో తెలంగాణ కుటుంబాలపై పన్ను భారం తగ్గే అవకాశం
- ఆహార పదార్థాలపై పన్ను రేటు గణనీయంగా తగ్గుతుందని అంచనా
- ప్రస్తుతం 10.4 శాతంగా ఉన్న పన్ను భారం 7.1 శాతానికి పడిపోయే సూచనలు



**హైదరాబాద్**

ప్రతిపాదిత జీఎస్టీ 2.0 విధానం అమల్లోకి వస్తే తెలంగాణలోని కుటుంబాలపై పన్ను భారం తగ్గే అవకాశం ఉందని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సీఈఎస్‌ఎస్) తన అధ్యయనంలో వెల్లడించింది. అయితే, ఈ విధానం ప్రజల వద్ద అదనపు నగదును మిగిల్చే కంటే, పెరుగుతున్న ద్రవ్యోల్బణం నుంచి వారికి పాక్షిక రక్షణ కల్పించేందుకే ఎక్కువగా దోహదపడుతుందని నివేదిక స్పష్టం చేసింది. సెస్ అంచనాల ప్రకారం, జీఎస్టీ 2.0 అమలైతే తెలంగాణ కుటుంబాలపై ప్రస్తుతం 5.4 శాతం నుంచి 10.4 శాతంగా ఉన్న పన్ను భారం, 3.9 శాతం నుంచి 7.1 శాతానికి తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆహార పదార్థాలపై పన్ను భారం గణనీయంగా తగ్గుతుందని ఈ అధ్యయనం పేర్కొంది. ఆహారం వస్తువులపై

- మిగతా 3లో

శుక్రవారం 28 ఆగస్టు 2026

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

## నారా లోకేష్ కి... రాఖి కట్టిన మంత్రి సవితమ్మ



పెనుగొండ (అమరావతి) ఆగస్టు 28 సీమ వార్త సాయంత్రం. రక్షాబంధన్ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవిత మంత్రి నారా లోకేశ్ ని కలసి రాఖీ కట్టారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సవిత గారు నారా లోకేశ్ గారికి రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మంత్రి నారా లోకేశ్ కి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రక్షాబంధన్ పర్వదినం ప్రతి కుటుంబంలో సంతోషాన్ని, సోదరభావాన్ని నింపాలని ఆకాంక్షించారు.

# రూల్స్‌కు లోబడే... సర్వే ప్రక్రియ ఉండాలి..!!

.......సర్ --2026పై జిల్లా ఎన్నికల ఓటర్ల జాబితా పరిశీలకుల సమీక్ష

.....ఓటర్ల జాబితా ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

.....జిల్లా ఎన్నికల ఓటర్ల జాబితా పరిశీలకులు డా. కె. శ్రీనివాసులు

.....ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలి

......: జిల్లా కలెక్టర్ - ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి, ఆగస్టు 28 సీమ వార్త సాయంత్రం.**



ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ --2026 ప్రక్రియపై జిల్లా ఎన్నికల ఓటర్ల జాబితా పరిశీలకులు డా. కె. శ్రీనివాసులు, ఐ.ఏ.ఎస్. శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లాలో సర్ --2026 ప్రక్రియలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి అధికారులు తీసుకుంటున్న చర్యలు, అధికారుల బాధ్యతలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల ఓటర్ల జాబితా పరిశీలకులు డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ సర్ --2026 ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనల మేరకు సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎటువంటి లోపాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ సర్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అనర్హులు, మరణించిన వారు, డూప్లికేట్ నమోదులు తదితర అంశాలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బంది నిర్వహిస్తున్న పనులను నిరంతరం పర్యవేక్షించాలని, ఏవైనా సమస్యలు లేదా సందేహాలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో కొండయ్య, ఆర్డీఓలు, మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రక్షా బంధన్ దారం కాదు...
## ప్రేమ బాధ్యతకు రక్షణ..!!

.....పరిటాల వారి ఇంట రక్షాబంధన్ సందడి

.....తన సోదరులకు రాఖీ కట్టిన ఎమ్మెల్యే పరిటాల సునీత

....పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థకు రాఖీ కట్టిన సోదరి స్నేహలత

....తన జీవితంలో సోదరుల సహకారాన్ని మరువలేనన్న సునీత



**అనంతపురం ఆగస్టు 28 సీమ వార్త సాయంత్రం.**

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇంట.. రక్షా బంధన్ సందడి కనిపించింది. అనంతపురంలోని తన నివాసంలో కుటుంబసభ్యులతో కలిసి రాఖీ పౌర్ణమి ఘనంగా జరుపుకున్నారు. తన సోదరులు ధర్మవరపు బాలాజీ, మురళీతో పాటు ఇతర సోదరులకు ఎమ్మెల్యే సునీత రాఖీలు కట్టారు. మిఠాయిలు తినిపించి తన ప్రేమను చాటుకున్నారు. సోదరులు ఎమ్మెల్యే సునీత పాదాలకు నమస్కారం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే కార్యాలయ సిబ్బంది, నియోజకవర్గ ముఖ్య నాయకులు, అధికారులు, గన్ మెన్లకు రాఖీ కట్టారు. బ్రహ్మకుమారీలు పరిటాల సునీత నివాసంలో అందరికీ రాఖీలు కట్టారు. మిఠాయిలు పంచి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ధర్మవరం టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ కు వారి సోదరి పరిటాల స్నేహలత రాఖీ కట్టారు. పరిటాల శ్రీరామ్ కుమారుడు జూనియర్ పరిటాల రవీంద్రకు తన సోదరి అమైరా రవీంద్ర రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రాప్తాడు నియోజకవర్గ ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక ఎమ్మెల్యేగా, గతంలో మంత్రిగా రాజకీయాల్లో రాణిస్తున్నానంటే వెనుక ఎంతో మంది అన్నదమ్ముల సహకారం ఉందన్నారు. నాకోసం పనిచేస్తున్న వారిని, నా వెంట నడుస్తున్న వారిని ఎప్పటికీ మరువలేనని అన్నారు..

## పల్లె క్షేత్రంలో... ఉమమ్మ జ్ఞాపకాల వేడుకలు..!!

....ఆగస్టు 30 న కీ శే పల్లె ఉమా 8 వర్ధంతి.

.....భారీ ఎత్తున వర్ధంతి వేడుకలు

.....హాజరుకానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, కూటమి పార్టీ నేతలు

....వేడుకలకు హాజరుకావాలని పిలుపునిచ్చిన.... పల్లె రఘునాథ్ రెడ్డి.

**పుట్టపర్తి డెస్క్ 28 సీమ వార్త సాయంత్రం.**



పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల,బాలాజీ విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు అమృతమూర్తి కీ శే పల్లె ఉమా 8 వ వర్ధంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియా ద్వారా వెల్లడించారు. రాప్తాడు మండలం ప్రసన్నాయన పంచాయతీలోని పల్లె వ్యవసాయ క్షేత్రంలో ఉన్న పల్లె ఉమా ఘాట్ వద్ద ఆగస్టు 30 ఆదివారం ఉదయం 10 గంటలకు పల్లె కుటుంబ సభ్యులు పల్లె ఉమా కి ముందుగా ఘన నివాళులు అర్పించనున్నారు. ఈ వర్ధంతి వేడుకలకు పుట్టపర్తి నియోజవర్గంలోని కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీలకు సంబంధించిన టీడీపీ ,బిజెపి ,జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులతోపాటు ముఖ్యంగా నియోజవర్గ ప్రజలు అనంతపురం జిల్లాలోని కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు,మరియు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పల్లె అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నియోజవర్గ ప్రజలను కోరారు. ఇదే ఆహ్వానంగా భావించి పల్లె ఉమా వర్ధంతి వేడుకలకు ప్రజలు ,పల్లె అభిమానులు మరియు నియోజవర్గ ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరుకావాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానం పలికారు.



## అవయవాలలో ముఖ్యమైనది కళ్ళు

ఎంతోమందికి కంటి చూపు తెప్పిస్తున్న రామా నాయక్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు

తన వంతు సహకారాలు అందించడానికి సిద్ధం

హిందూపురం ఎంపీ బి కే పార్థసారథి

పాల్గొన్న... జిల్లా గ్రంథాలయ చైర్మన్ వడ్డే వెంకట్

**సోమందేపల్లి ఆగస్ట్ 28 సీమ వార్త సాయంత్రం.**



మనిషి అవయవాలలో అతి ముఖ్యమైనది కళ్ళు, అటువంటి కళ్ళకు ఉచిత చికిత్సలు అందించడం గొప్ప విషయమని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీ శ్రీ సాయిబాబా గత వారం రోజులుగా శంకర నేత్రాలయ ఉచిత వైద్య శిబిరం ద్వారా స్వర్గీయ లాలా సింగ్ రా మా నాయక్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆగస్ట్ 28న రామా నాయక వర్ధంతి, ఉచిత కంటి వైద్య శిబిరం ముగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా హిందూపురం ఎంపీపీ పార్థసారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా వందలాది మందికి చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారని అదేవిధంగా దాదాపు 150 మందికి పైగా సోమందేపల్లిలోనే మొబైల్ వ్యాన్లు ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి ఎంతోమందికి వెలుగు అందించడం గొప్ప విషయం అన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఎన్నో కుటుంబాల్లో వెలుగు నింపిన వారవుతారని కొనియాడారు. భవిష్యత్తులో మా వంతు సహాయ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. గతంలో తాను జిల్లా పరిషత్ చైర్మన్ గా, ఎమ్మెల్యే గా, ఎంపీ గా ఉన్నప్పుడు రామా నాయక్ జన్మించిన నాగినాయన చెరువు గ్రామానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చామని గుర్తు చేశారు. అనంతరం రామా నాయక్ కుటుంబ సభ్యులు ఎంపీ పార్థసారథిని, అతని కుమారుడు బీకే సాయి కల్యాణ్ ను శాలువలు, బొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప్పుర కార్పొరేషన్ చైర్మన్ రంగేపల్లి వెంకటరమణ, రామా నాయక్ కుటుంబసభ్యులు బాపూజీ నాయక్, రాంప్రసాద్ నాయక్, శ్రీనివాసనాయక్ నాగినాయన చెరువు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.ఖ



# ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ కీలక ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిజిస్థాన్‌లో మోదీ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను నేతలిద్దరూ సమగ్రంగా సమీక్షించనున్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. కిర్గిజ్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు బిష్కెక్ నగరంలో ఎస్‌సీవో సదస్సుకు మోదీ హాజరవుతారు. చివరి రోజు ఆయన ప్లీనరీలో ప్రసంగిస్తారు. ఆరో 'వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవ వేడుకల్లోనూ ఇతర ఎస్‌సీవో దేశాల నేతలతో కలిసి మోదీ పాల్గొంటారు. కిర్గిజ్‌స్థాన్ పర్యటనకు ముందు 29, 30 తేదీల్లో మోదీ ఉజ్బెకిస్థాన్‌లో పర్యటిస్తారు. పుతిన్?తో జరిగే భేటీలో భారత్?– రష్యా ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది. ఇరు దేశాల మధ్య సహకారం, పరస్పర ప్రయోజనాలు, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై నేతలు సమీక్ష నిర్వహించినున్నట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి సీబీ జార్జ్ తెలిపారు. అలాగే ఇతర దేశాల నేతలతోనూ మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఆయా నేతల సమయానుకూలత, అందుబాటును బట్టి సమావేశాల షెడ్యూల్ ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు.



**ముందుగా ఉజ్బెకిస్థాన్‌కు మోదీ**

కిర్గిజిస్థాన్ పర్యటనకు ముందు ప్రధాని మోదీ ఆగస్టు 29, 30 తేదీల్లో ఉజ్బెకిస్థాన్‌లో పర్యటించనున్నారు. ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు తాష్కెంట్‌కు వెళ్లనున్నారు. ఇది ఉజ్బెకిస్థాన్‌లో మోదీకి నాలుగో పర్యటన కాగా, ద్వైపాక్షిక పర్యటనగా రెండోసారి వెళ్లడం. తాష్కెంట్‌లో మిర్జియోయెవ్‌తో మోదీ ప్రతినిధి స్థాయి చర్చలు నిర్వహించనున్నారు. భారత్–ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశం. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి అంశాలపై ఇరు నేతలు చర్చించనున్నారు.

**దాదాపు 100 కోట్ల డాలర్ల వాణిజ్యం, పెట్టుబడులు**


భారత్–ఉజ్బెకిస్థాన్ మధ్య ఆర్థిక సంబంధాలు క్రమంగా విస్తరిస్తున్నాయి. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విలువ కలిపి దాదాపు 100 కోట్ల డాలర్లకు చేరినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. కీలక ఖనిజాలు, ఔషధాలు, విద్య, సమాచార సాంకేతికత, ఆరోగ్య రంగాల్లో ఇరు దేశాలు సహకరిస్తున్నాయి. ఉజ్బెకిస్థాన్‌లో ప్రస్తుతం 16 వేలకు పైగా భారతీయ విద్యార్థులు చదువుతున్నారని అధికారులు తెలిపారు. అక్కడ నాలుగు భారతీయ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు కూడా ఉన్నాయి. ఔషధాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, వినోద పార్కులు, విద్య తదితర రంగాల్లో భారతీయ పెట్టుబడులు ఉన్నాయి.

**'వికసిత్ భారత్–2047'పై చర్చ**

మోదీ, మిర్జియోయెవ్ సమావేశంలో భారత్ ప్రతిపాదిస్తున్న 'వికసిత్ భారత్–2047', ఉజ్బెకిస్థాన్ అభివృద్ధి లక్ష్యం 'ఉజ్బెకిస్థాన్–2030' మధ్య సహకారానికి సంబంధించిన అంశాలపై కూడా చర్చించే అవకాశం ఉంది. వాణిజ్యం, పెట్టుబడులు, కీలక ఖనిజాలు, ఆరోగ్య రంగం, విద్య, అంతరిక్షం, సాంకేతికత, సంస్కృతి, వ్యాపార సంబంధాలు వంటి కొత్త రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంచుకోవడంపై ఇరు దేశాలు దృష్టి సారించనున్నాయి. తాష్కెంట్‌లో శాస్త్రి మెమోరియల్, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఉజ్బెక్ అధ్యక్షుడు మోదీ గౌరవార్థం ఏర్పాటు చేసే విందులోనూ ప్రధాని పాల్గొంటారు. ఎస్‌సీఓలో ప్రస్తుతం 10 సభ్య దేశాలు ఉన్నాయి. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం వంటి సవాళ్లను ఎదుర్కోవడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. కాలక్రమేణా వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, కనెక్టివిటీ, సాంకేతికత తదితర రంగాలకు కూడా సహకారం విస్తరించింది.

# భారత అథ్లెట్ల నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందా

యువతను పాడుచేస్తున్న డ్రగ్స్ వ్యసనానికి వ్యతిరేకంగా పోరాడటంలో క్రీడలు ఒక అద్భుతమైన ఆయుధంగా పనిచేస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. క్రీడలు జీవితాలను ఎలా మార్చగలవో చెప్పడానికి మన పారా అథ్లెట్లు ఒక ఉదాహరణ అని, వారి నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానని అన్నారు. క్రీడల పట్ల తన దృక్పథం కేవలం పతకాలు సాధించడం మాత్రమే కాదని, దేశ నిర్మాణ ప్రక్రియలో వాటిని ఒక అంతర్భాగంగా మార్చడమేనని పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా డైలాగ్?లో మోదీ వర్చువల్?గా పాల్గొని మాట్లాడారు. ఇందులో వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది క్రీడాకారులు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



"ఒలింపిక్స్‌లో అనేక రకాల క్రీడలు ఉంటాయి. కానీ భారతీయ జట్లు వాటిలో కనీసం సగం విభాగాల్లో కూడా పాల్గొనడంలేదు. ఇదొక చేదు నిజం. ఎందుకంటే, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మొత్తం 32 క్రీడా విభాగాలలో భారత్ కేవలం 16 విభాగాల్లో మాత్రమే పాల్గొంది. మొత్తం పతకాల సంఖ్యలో గణనీయమైన భాగానికి మనం పోటీనే పడటం లేదు. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రపంచంలోని ఇతర దేశాలు క్రీడల్లో పతకాలు సాధిస్తుంటే, మనం కనీసం వాటిలో పాల్గొనడం కూడా లేదు. పతకాల సంఖ్యను పెంచుకోవాలంటే సంబంధిత క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకోవాలి. ఇటీవల నిర్వహించిన కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్?కు పతకాలు తెచ్చిపెట్టే బ్యాడ్మింటన్, హాకీ, క్రికెట్, రెజ్లింగ్ వంటివి లేకపోవడం ఈ సమస్య మరింత స్పష్టంగా కనిపించింది. మొత్తం 10 క్రీడలకు గాను ఆరు పారా–క్రీడా ఈవెంట్లలో మాత్రమే భారత్ పాల్గొంది. అయినప్పటికీ, 13 స్వర్ణాలు, 17 రజతాలు, తొమ్మిది కాంస్య పతకాలతో పాయింట్ల పట్టికలో భారత్? నాలుగో స్థానంలో నిలిచింది."

**'యువ ప్రతిభను గుర్తించాలి'**

ఆరోగ్యకరమైన సమాజానికి క్రీడా స్ఫూర్తి చాలా ముఖ్యమని, అయితే, మైదానంలోకి అడుగుపెట్టకుండా ఆ స్ఫూర్తిని అలవర్చుకోవడం చాలా కష్టమని మోదీ అన్నారు. విజేతలుగా ఎలా నిలవాలో నేర్పడమే కాకుండా, మంచి పోటీదారులుగా ఎలా ఎదగాలో క్రీడల నుంచి నేర్చుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. 2036 ఒలింపిక్స్ కోసం ఇప్పటి నుంచే అథ్లెట్లను సిద్ధం చేయాలని మోదీ పిలుపునిచ్చారు. గతంలో నిర్వహించిన ఒలింపిక్స్ పోటీల్లో భారత్? నుంచి చాలా తక్కువ జట్లు పాల్గొన్నారని చెప్పారు. "2036 ఒలింపిక్స్ భారతదేశంలోనే జరగాలని మేం నిర్ణయించుకున్నాం. ఈ నేపథ్యంలో వివిధ క్రీడాంశాలపై భారత్? దృష్టి సారించాల్సిన అవకాశం ఉంది. 2036 ఒలింపిక్స్ సన్నద్ధతలో భాగంగా, ముఖ్యంగా ప్రస్తుతం ఐదు, 10 లేదా 15 ఏళ్ల వయస్సు ఉన్న యువ ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రతి గ్రామం, నగరం, పాఠశాలలో ప్రతిభాన్వేషణ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం" అని మోదీ తెలిపారు.

**'వారికి ప్రభుత్వ మద్దతు ఉంటుంది'**

అయితే, క్రీడల్లో పాల్గొనేందుకు అభ్యర్థులకు అవసరమైన మద్దతును ప్రభుత్వం తప్పక అందిస్తుందని మోదీ హామీ ఇచ్చారు. 21వ శతాబ్దపు ఆధునిక క్రీడా వ్యవస్థను (ఎకోసిస్టమ్) రూపొందించడానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆ దిశగా క్రీడా విశ్వవిద్యాలయాల నుంచి ఆధునిక శిక్షణా కేంద్రాల వరకు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. 80 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి తాను చేసిన ప్రసంగాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆ ప్రసంగంలో భారతదేశ క్రీడా భవిష్యత్తుపై తన దార్శనికతను వివరించారు. దేశ క్రీడా బలాన్ని యువ శక్తితో మేళవించి, దానిని దేశ నిర్మాణానికి మళ్లించడమే ప్రధాన లక్ష్యమని మోదీ పేర్కొన్నారు.

# 400 మందితో భారత్‌కు జిన్‌పింగ్

**న్యూఢిల్లీ :** చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వచ్చే నెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్‌కు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 400 మంది అధికారుల భారీ ప్రతినిధి బృందంతో ఆయన రానున్నట్లు సమాచారం. 2020 నాటి సరిహద్దు వివాదాల తర్వాత ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను మెరుగుపరిచే దిశగా.. ఇది ఓ కీలక పరిణామంగా మారనుంది. అదే సమయంలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ సరిహద్దు చర్చల నిమిత్తం బీజింగ్‌లో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.బ్రిక్స్ సదస్సు కోసం షీ జిన్‌పింగ్ వెంట దాదాపు 400 మంది సభ్యులతో కూడిన భారీ ప్రతినిధి బృందం భారత్‌కు రానున్నట్లు సమాచారం. 2019 నాటి పర్యటనతో పోలిస్తే ఈ సంఖ్య రెట్టింపు కావడం గమనార్హం. ప్రస్తుతం చైనా అధికారులు ఢిల్లీలో హోటళ్ల కేటాయింపులు, భద్రతా ప్రోటోకాల్‌లను ఆఖరి దశలో సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. సదస్సు కేవలం బ్రిక్స్ ఎజెండా కోసమే కాకుండా భారత్–చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ సంకేతంగా నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.ఒకవైపు షీ జిన్‌పింగ్ రాకపై సన్నాహాలు జరుగుతుండగానే.. మరోవైపు భారత జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ సోమవారం చైనా రాజధాని బీజింగ్‌కు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం వెళ్లిన డోభాల్.. మంగళవారం జరిగే రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో పాల్గొని సుదీర్ఘ సరిహద్దు వివాదాలపై చర్చించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా చైనా విదేశాంగ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు వాంగ్ ఈ తో కూడా ఆయన ద్వైపాక్షిక సమావేశం కానున్నారుభారత్–చైనా మధ్య హిమాలయ ప్రాంతంలో 3,800 కిలో మీటర్ల మేర సరిహద్దు వివాదం కొనసాగుతోంది. 2020లో జరిగిన గల్వాన్ లోయ ఘర్షణల్లో 20 మంది భారత సైనికులు, నలుగురు చైనా సైనికులు ప్రాణాలు కోల్పోవడంతో ఇరు దేశాల మధ్య శాంతి వాతావరణం పూర్తిగా దెబ్బతింది. ఆ తర్వాత నాలుగేళ్ల మిలిటరీ సైనిక చర్చల ఫలితంగా 2024 అక్టోబర్ నాటికి ఒప్పందం కుదిరింది. అయితే జూలై చివర్లో సరిహద్దు వద్ద మళ్లీ సైనికులు ఎదురెదురుపడటంతో.. సరిహద్దుల్లో పూర్తి శాంతి పునరుద్ధరణే దౌత్య సంబంధాలకు ప్రాతిపదిక అని భారత్ ఇటీవల స్పష్టం చేసింది.అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠినమైన వాణిజ్య విధానాల నేపథ్యంలో.. భారత్, చైనా రెండూ బ్రిక్స్ వేదికగా పరస్పర సహకారాన్ని పెంచుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. షీ జిన్‌పింగ్ చివరి పర్యటన నిర్ణయం ఇంకా పూర్తిగా ఖరారు కావాల్సి ఉన్నప్పటికీ.. బీజింగ్ మాత్రం భారత్ నిర్వహిస్తున్న ఈ సదస్సుకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.



## ఘనంగా రక్షాబంధన్ పండుగ వేడుకలు

**మడకశిర ఆగస్టు 28 సీమ వార్త సాయంత్రం.** పట్టణంలోని పెనుకొండ రోడ్డు నందు గల మండల ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా రక్షాబంధన్ పండుగను విద్యార్థులు ఉపాధ్యాయులు కలసి నిర్వహించడం జరిగింది. బాల బాలికలు సోదర భావంతో బాలికలు బాలురకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఈ సందర్భంగా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సోదరీ సోదరుల మధ్య ఉండే అపారమైన ప్రేమానురాగాలకు ప్రతీక రక్షాబంధన్ సోదరి ప్రేమతో కట్టే రాఖి చేతి పై మెరిసిపోతుంటే ఆమెను ఎల్లప్పుడూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని సోదరుడు మాట ఇస్తాడు మారుతున్న మారుతున్న ప్రస్తుత సమాజంలో కేవలం మాటలకే పరిమితం కాకుండా ఆమె జీవితానికి నిరంతరం రక్షణ కల్పించే విధంగా అడుగులు వేయడమే నిజమైన కానుక అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నార.

## పుదుచ్చేరిలోని నవగ్రహాలను దర్శించుకున్న రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్

**మడకశిర ఆగస్టు 28 సీమ వార్త సాయంకాలం** కుంచితి వక్కలుగా రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ పుదుచ్చేరి రాష్ట్రంలోని నవగ్రహాలను దర్శించుకోవడం జరిగిందన్నారు. సీనియర్ టిడిపి నాయకులు రియల్ ఎస్టేట్ మంజునాథ్, మాంచాల బార్ అండ్ రెస్టారెంట్ అధినేత రవి, నరసయ్య గౌడ్, నాగరాజ్ తదితరులు పుదుచ్చేరి రాష్ట్రంలోని నవగ్రహాలను దర్శించుకోవడం జరిగిందన్నారు. తిరు నల్లూర్ లోని దేవాలయాలను సందర్శించి మొక్కుబడులు తీర్చుకోవడం జరిగిందన్నారు. పుదుచ్చేరి రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందన్నారు.



## 'ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్యనే మరో 25 ఏళ్లు పాటు కొనసాగించాలి' -డీలిమిటేషన్‌పై మోదీకి ఖర్గే లేఖ

దేశ రాజకీయాల్లో కీలకమైన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వానికి కీలక ప్రతిపాదనలు చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రతిపాదనలను అన్ని రాజకీయ పార్టీలతో పంచుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. దీనిపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. ప్రస్తుత లోక్?సభలోని సభ్యుల సంఖ్యను 25 ఏళ్ల పాటు యథాతథంగా ఉంచాలని డిమాండ్ చేశారు. 'లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాల సంఖ్యను మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలి. అంతేకాకుండా రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యలోనూ మరో 25 ఏళ్లపాటు మార్పులు చేయకూడదు. దీంతో పాటు 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు మూడో వంతు రిజర్వేషన్ అమలు చేయాలి. డీలిమిటేషన్‌తో పాటు మహిళా రిజర్వేషన్ అంశం కూడా దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యమున్న అంశం. ప్రభుత్వం వద్ద ఉన్న డీలిమిటేషన్ ప్రతిపాదనలను అన్ని పార్టీలతో చర్చించాలి. వాటిని అధ్యయనం చేసేందుకు రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన సమయం ఇవ్వాలి' అని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు. జులై 16న కూడా ఇదే అంశంపై ప్రధానికి లేఖ రాసినట్లు ఖర్గే గుర్తుచేశారు. డీలిమిటేషన్‌పై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని అప్పుడే కోరినట్లు తెలిపారు. అయితే ఇప్పుడు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి టీవీ ఇంటర్వ్యూలో ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించే అవకాశం ఉందని చెప్పడంతో మరోసారి ఈ విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. డీలిమిటేషన్ వంటి కీలకమైన అంశంపై కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా విస్తృతంగా చర్చించాలని ఖర్గే కోరారు. ఈ విషయంలో ఏకాభిప్రాయం కోసం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశానికి అత్యంత ప్రాధాన్యమైన అంశమని అన్నారు. ఏప్రిల్ 16, 17 తేదీల్లో చేసినట్లుగా మరోసారి ఈ ప్రక్రియను బుల్డోజ్ చేయడానికి ప్రయత్నించవద్దని ప్రధాని మోదీని ఉద్దేశించి ఖర్గే వ్యాఖ్యానించారు.

**మహిళా రిజర్వేషన్‌పైనా కాంగ్రెస్ పట్టుబట్టు**

లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్? కల్పించాలన్న అంశాన్ని కాంగ్రెస్? గతంలోనూ ప్రస్తావించింది. ఈ నెల ప్రారంభంలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఈ డిమాండ్లను పునరుద్ఘాటించాయి. డీలిమిటేషన్?కు సంబంధించిన అంశాలతో ముడిపెట్టి మహిళ రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలన్న ప్రధాని విజ్ఞప్తిని కాంగ్రెస్ గతంలో విమర్శించింది. మహిళ రిజర్వేషన్ పేరుతో ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తోందని ఆరోపించింది.

**ఏప్రిల్‌లో బిల్లుకు ఎదురుదెబ్బ**

2026 బడ్జెట్ సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఎదురుదెబ్బ తగిలింది. ఏప్రిల్ 17న జరిగిన ఓటింగ్‌లో మొత్తం 528 మంది ఎంపీలు పాల్గొన్నారు. వారిలో 298 మంది బిల్లుకు అనుకూలంగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలోని ఓట్లలో మూడింట రెండు వంతుల మద్దతు అవసరం. అంటే 352 ఓట్లు రావాల్సి ఉండగా, అనుకూలంగా 298 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇక పార్లమెంట్ వర్షాకాల? సమావేశాలు నిరవధిక వాయిదా రెండు వారాలపైగా అవుతున్న ఇంతవరకు ప్రొరోగ్?పై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మహిళ రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్‌పై కేంద్రం ఎలాంటి ప్రతిపాదన తీసుకొస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది.

## 'ఆపరేషన్ సిందూర్‌లో చైనా పాత్రపై గందరగోళం' - మాజీ జణూ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రశ్నలు

ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా– పాకిస్థాన్ మధ్య సైనిక సహకారంపై మాజీ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రశ్నలు వర్షం కురిపించింది. గతంలో డిప్యూటీ చీఫ్? ఆఫ్? ఆర్మీ స్టాఫ్? లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ చేసిన వ్యాఖ్యలకు, తాజాగా అనిల్ చౌహాన్ చెప్పిన అంశాలకు పొంతన లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు గతేడాది రాహుల్ సింగ్ చేసిన వ్యాఖ్యలు, తాజాగా అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను జైరాం రమేశ్ ఎక్స్?లో షేర్ చేశారు. చైనా– పాక్ సైనిక సహకారంపై భిన్నమైన వాదనలు ఎందుకు వినిపిస్తున్నాయని ప్రశ్నించారు. 2025 జులై 4న లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా–పాకిస్థాన్ మధ్య ఉన్న సహకారం గురించి తీవ్రంగా ప్రస్తావించారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. అయితే 2026 ఆగస్టు 25న మాజీ సీడీఎస్ అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలు అందుకు భిన్నంగా ఉన్నాయని తెలిపారు. ఇక్కడ ఏం జరుగుతోంది కథనాన్ని మార్చేందుకు ఏదైనా లోతైనా ప్రణాళిక ఉందా దేశ ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. చైనాతో సంబంధాల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై కూడా ఆయన విమర్శలు చేశారు. చైనా విషయంలో మోదీ ప్రభుత్వం రాజీ ధోరణిని అనుసరిస్తోందా? అన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు.

సీమ వార్త సాయంకాలం
శుక్రవారం
28 ఆగస్టు 2026

## మండల కన్వీనర్ చౌదరికి... రాఖీ కట్టిన వీర మహిళ.



**గోరంట్ల ఆగస్టు 28 సీమ వార్త సాయంత్రం.** అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతికైనా రాఖీ పౌర్ణమి ని పురస్కరించుకొని పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జనసేన పార్టీ వీర మహిళ కావేరి తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి నరేష్ కు సైతం పార్టీ కార్యాలయంలో ఆమె రాఖీ కట్టి ఆశీస్సులు పొందారు.

## బిజెపి నాయకుడు సోదరి మృతి పట్ల సంతాపం



**మడకశిర ఆగస్టు 28 సీమ వార్త** మండల పరిధిలోని వివిధ గ్రామాలలో మృతి చెందిన వారికి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి . గుడిబండ పట్టణంలోని హెచ్ పి గ్యాస్ యజమాని జిబి సుధాకర్ సోదరి పద్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయము తెలుసుకున్న వెంటనే మాజీ ఎమ్మెల్సీ గుండుమతిప్పయ్య స్వామి వారి స్వగ్రామానికి వెళ్లి మృతదేహాలపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో హెచ్.పీ గ్యాస్ యజమాని సుధాకర్, గుడిబండ మండలం ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, కరుణాకర్, మంజునాథ్, శశి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మహిళను గౌరవంగా చూడటం మరియు వారికి రక్షణ కల్పించడం ప్రతి పౌరుడి కర్తవ్యం - పాఠశాల ఖజాంచి పరంధామరెడ్డి.



**పావగడ ఆగస్టు 28 సీమ వార్త సాయంత్రం** పావగడ : రక్షా బంధన్ అనేది సోదరీ సోదరుల మధ్య పవిత్ర ప్రేమ, విశ్వాసం మరియు బాధ్యతకు ప్రతీక అని పాఠశాల ఖజాంచి పరంధామరెడ్డి తెలిపారు. పట్టణంలో శుక్రవారం జరిగిన రక్షా బంధన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రక్షా' అంటే రక్షణ, 'బంధన్' అంటే బంధం. అంటే సోదరి రక్షణ బాధ్యతను సోదరుడు స్వీకరించే పవిత్ర పండుగ ఇది. రక్షా బంధన్ కేవలం సొంత అన్నా–చెల్లెళ్లకే పరిమితం కాదు. సమాజంలో పరస్పర గౌరవం, ప్రేమ మరియు సోదరభావాన్ని పెంచే పవిత్ర ఆచారం. ప్రతి మహిళను గౌరవంగా చూడటం మరియు వారికి రక్షణ కల్పించడం ప్రతి పౌరుడి విధి అని ఈ పండుగ మనకు గుర్తు చేస్తుందని ఆయన అన్నారు. సోదరి తన సోదరుడి నుదుట తిలకం దిద్ది, హారతి వెలిగించి, మణికట్టుకు పవిత్ర 'రాఖీ' కడుతుంది. అతని దీర్ఘాయుష్షు మరియు శ్రేయస్సు కోసం దేవుణ్ణి ప్రార్థిస్తుంది. సోదరుడు చెల్లెలికి తీపి తినిపించి, జీవితాంతం ఆమెకు అండగా నిలబడి రక్షిస్తానని హామీ ఇస్తాడని తెలిపారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు పాఠశాల ఖజాంచి పరంధామరెడ్డితో సహా ఉపాధ్యాయులకు కుంకుమ పెట్టి, తీపి తినిపించి, రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## వాల్మీకి విగ్రహానికి... వన్నూరు విరాళం.

....విగ్రహ ప్రతిష్టకు...బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బోయ వన్నూరు స్వామి రూ, 10 వేల సాయం



**డి హిరేహాల్ ఆగస్టు 28 సీమవార్త సాయంకాలం:** బొమ్మనహాళ్ మండలంలోని దర్గా హోన్నూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న శ్రీ శ్రీ మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపనకు డి హిరేహాల్ మండలం హెచ్ సిద్దాపురం గ్రామానికి చెందిన బీజేపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు బోయ వన్నూరు స్వామి తన వంతు సహాయంగా ?10,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని దర్గా హోన్నూర్ గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు రామకృష్ణకు అందించారు. వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి సహకరించిన వన్నూరు స్వామిగారికి గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

## మహాలక్ష్మి పూజల్లో... ఓబులాపురం జనం మమేకం.

..... పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న మహాలక్ష్మి అమ్మవారు.




**డి హిరేహాల్ ఆగస్టు 28 సీమవార్త సాయంకాలం:** డి.హిరేహాల్ మండలంలోని ఓబులాపురం గ్రామంలో కొలువైన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ మాసం సందర్భంగా ఆలయానికి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిత్య అన్నదానం కొనసాగుతోందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## మంగళగిరి జనసేన ఆఫీస్ లో... జిల్లా కార్యదర్శి సురేష్.




**గోరంట్ల ఆగస్టు 28 సీమ వార్త సాయంత్రం.** జనసేన పార్టీ పిలుపుమేరకు విజయవాడ మంగళగిరి పార్టీ ఆఫీస్ నందు ఆత్మీయ సమావేశానికి పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసిలు కౌన్సిలర్లు రాబోయే ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునివ్వడం జరిగింది. అందులో పాల్గొన్న ఉమ్మడి అనంతపూర్ జిల్లా కార్యదర్శి సురేష్

## ధర్మవరం టిడిపి కార్యాలయంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు.

.... ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్.



**ధర్మవరం;; ఆగస్టు 28 సీమ వార్త సాయంత్రం.** ధర్మవరం నియోజకవర్గ అక్క, చెల్లెమ్మల ప్రేమ, ఆప్యాయతలను ఎప్పటికీ మర్చిపోలేనని తెలుగుదేసం పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం టీడీపీ కార్యాలయంలో రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పరిటాల శ్రీరామ్ కు తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు, పట్టణానికి చెందిన పలు వర్గాల మహిళలు రాఖీలు కట్టారు. మహిళలు పెద్ద ఎత్తున తరలి రావడంతో కార్యాలయంలో సందడి వాతావరణం కనిపించింది. శ్రీరామ్ ప్రతి ఒక్కర్నీ ఆప్యాయంగా పలుకరిస్తూ... తనకన్న చిన్న వయసు ఉన్న వారిని ఆశీర్వదించారు. తనకన్న పెద్ద వయసు ఉన్న వారు శ్రీరామ్ ను ఆశీర్వదించారు. ధర్మవరం నియోజకవర్గంలో ప్రతి అక్క, చెల్లెళ్లకు రక్షా బంధన్ సందర్భంగా శ్రీరామ్ శుభాకాంక్షలు తెలియజేశారు. అన్న చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగ వేళ ఇంత మంది మహిళల ప్రేమను చూడటం ఆనందంగా ఉందన్నారు.

## ఓటర్ల సర్వే పారదర్శకంగా జరగాలి.

పుట్టపర్తిలో ఓటర్ల జాబితా సవరణ 2026 క్షేత్రస్థాయి పరిశీలనలి

....పరిశీలకులు డా. కె. శ్రీనివాసులు, కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్.





**పుట్టపర్తి ఆగస్టు 28: సీమ వార్త సాయంత్రం.** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ -- 2026 ప్రక్రియలో భాగంగా, శ్రీ సత్య సాయి జిల్లాకు ఎన్నికల సంఘం పరిశీలకులుగా నియమించిన డా. కె. శ్రీనివాసులు, ఐ.ఏ.ఎస్. మరియు జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఐ.ఏ.ఎస్. లు క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ పరిశీలనలో భాగంగా అధికారులు గోకులం ప్రాంతంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 110 లో బి.ఎల్.ఓ సుంగాల ఓబులేసు నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు మరియు సర్వే ప్రక్రియను నేరుగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఓటరు భూమిగాని రామప్ప సమాచారాన్ని, ఇతర నివాసిత వివరాలను అధికారుల బృందం క్షుణ్ణంగా సరిచూసింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని మరియు అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు లభించేలా ఇంటింటి సర్వేను కచ్చితత్వంతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమములో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, పుట్టపర్తి మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు, బిఎల్ఓలు మరియు సిబ్బంధి పాల్గొన్నారు.

## 400 మంది విద్యార్థుల మధ్య రాఖీ పౌర్ణమి వేడుకలు.

ఎస్ ఏ పీ ఎస్ జూనియర్, ఏ ఎన్ కె డిగ్రీ కాలేజీల్లో సాంప్రదాయ వేడుకలు.

పాల్గొన్న... కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ సూర్యనారాయణ.





**గోరంట్ల ఆగస్టు 28 సీమ వార్త సాయంత్రం** రక్షాబంధన్ సందర్భముగా ఎస్ ఏ పి ఎస్ . జూనియర్ కళాశాల మరియు ఏ ఎన్ కె డిగ్రీ కళాశాల సంయుక్తంగా కలసి రాఖీ పౌర్ణమి వేడుకలు సుమారు 400 మంది విద్యార్థులు తోటి జరుపుకోవడం జరిగినది . కళాశాలలోని బాలురందరికీ బాలికలు రాఖీ కట్టి తమ సోదరభావాన్ని తెలియజేశారు. రాఖీ కట్టిన తర్వాత బాలురు, బాలికలు అందరూ కలసి "నేను నీకు రక్ష – నీవు నాకు రక్ష, మనమిద్దరమూ కలసి ఈ సమాజానికి మరియు ఈ దేశానికి రక్ష" అని ఒక నినాదాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కెంపుల లక్ష్మి నారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ . సూర్యనారాయణ, సీనియర్ అధ్యాపకులు రామాంజ నేయులు,రమేష్, ఎన్ఎస్ఎస్పిఓ .లు నరసింహప్ప, రామాంజ నేయులు, జయప్రకాష్ మరియు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మృతి పట్ల సంతాపం



**మడకశిర ఆగస్టు 28 సీమ వార్త సాయంకాలం** నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండలం హెచ్ ఆర్ హెచ్ ఆర్ హట్టి గ్రామానికి చెందిన జిసి దేవరాజ్ స్వచ్ఛంద సంస్థలో డైరెక్టర్ గా పని చేస్తూ మృతి చెందారు. విషయము తెలిసిన వెంటనే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మృతదేహా నికి పూలమాలలు వేసి అర్పించారు. గుడిబండ మండలం హెచ్.ఆర్. హట్టి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, మైరాడ సంస్థ మాజీ డైరెక్టర్ దేవరాజు మృతి ఎంతో బాధాకరమని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు దేవరాజు, దేవగిరి, క్లస్టర్ ఇంచార్జ్ చంద్రశేఖర్ యాదవ్, సింగల్ విండో అధ్యక్షులు మదనకుంటప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.,

## పుట్టపర్తి సదస్సుకు.... నాదేండ్ల కు ఆహ్వానం.

......16వ జాతీయ వినియోగదారుల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని....మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఆహ్వానం

.....పుట్టపర్తిలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా జాతీయ వినియోగదారుల సదస్సు



**పుట్టపర్తి, ఆగస్టు 28: సీమ వార్త సాయంత్రం.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న 16వ జాతీయ వినియోగదారుల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని రాష్ట్ర పౌరసరఫరాలు, ఆహార మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్ గారిని ఆహ్వానించినట్లు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ శ్రీ జి. సురేష్ కుమార్ తెలిపారు. గురువారం అమరావతి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో క్యాప్కో రాష్ట్ర వైస్ చైర్మన్ కర్లపాటి శ్రీనివాసరావు, మహమ్మద్ బాజీలతో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి జాతీయ వినియోగదారుల సదస్సుకు అధికారికంగా ఆహ్వానించినట్లు సురేష్ కుమార్ తెలిపారు. అనంతరం పౌరసరఫరాల శాఖ కమిషనర్ శ్రీ కె. కన్నబాబు, ఐఏఎస్ మరియు డైరెక్టర్ ఆఫ్ సివిల్ సప్లైస్ శ్రీ నూపుర్ అజయ్ కుమార్, ఐఏఎస్లను కూడా జాతీయ వినియోగదారుల సదస్సుకు ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, జాతీయ వినియోగదారుల సదస్సు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు సురేష్ కుమార్ తెలిపారు.

**రెండు రోజుల పాటు జాతీయ సదస్సు...**

సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పుట్టపర్తిలో 16వ జాతీయ వినియోగదారుల సదస్సును రెండు రోజుల పాటు భారీ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు సురేష్ కుమార్ తెలిపారు. దేశం నలుమూలల నుంచి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నందున కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర స్థాయి అధికారులు, జాతీయ స్థాయిలోని ప్రతినిధులు, క్యాప్కో ప్రతినిధులు, వివిధ జిల్లాల వినియోగదారుల సంఘాల సభ్యులు పాల్గొననున్నారని తెలిపారు. వినియోగదారుల హక్కులు, ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాలు, వినియోగదారుల రక్షణ చట్టాల అమలు తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, వినియోగదారుల సమస్యలపై చర్చలు, భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు ఈ సదస్సులో జరగనున్నాయని సురేష్ కుమార్ తెలిపారు. జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో సదస్సును విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి, ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు క్యాప్కో చైర్మన్ సురేష్ కుమార్ తెలిపారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881